


డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు

నరసరావుపేట: పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు విస్తృతంగా నిర్వహించారు.



నందీశ్వరుడికి అభిషేకాలు

తెనాలి: కార్తిక మాస త్రయోదశి సందర్భంగా గురువారం ప్రదోష కాలంలో కఠెవరంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నందీశ్వరునికి అభిషేకాలు చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2010 క్యూసెకులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1198 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన



నెహ్రూనగర్: వీధి వ్యాపారులు ఫోన్ పే, గూగుల్ పే వంటి వాటి వినియోగంపై డిజిటల్ అక్షరాస్యత కలిగి ఉండి అవగాహన పెంచుకోవాలని గుంటూరు జిల్లా ఎల్‌డీఎం రత్న మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పాత గుంటూరులోని యూనియన్ బ్యాంకులో మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వనిధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. అవసరమైన రుణాలను అర్హులైన వీధి వ్యాపారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ విజయలక్ష్మి, మెప్మా సీఓ అహ్మద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యడ్ల లింగయ్య కాలనీలో కార్డన్ సెర్చ్

35 వాహనాలు సీజ్, అనుమానితులను ప్రశ్నించిన పోలీసులు



తెనాలి రూరల్: పట్టణ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యడ్ల లింగయ్య కాలనీలో పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో సుమారు 100 మంది పోలీసులు కాలనీలో ప్రతి ఇంటిని సోదా చేశారు. ఇళ్లలో ఉంటున్న వారి వివరాలను పరిశీలించారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. అనుమానితుల వివరాలను నమోదు చేసుకున్నారు. 30 బైక్‌లు, ఐదు ఆటోలకు సరైన పత్రాలు లేకపోవడంతో స్టేషనుకు తరలించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు ఒక్కసారిగా కాలనీకి రావడంతో ఏం జరిగిందో తెలియని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. జిల్లా ఏఎస్పీ(అడ్మిన్) జీవీ రమణమూర్తి, డీఎస్పీ బి.జనార్దనరావు, త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు పర్యవేక్షించారు. ఏడుగురు రౌడీ షీటర్లు ఉండగా ఐదుగురిని, మరో ఇద్దరు సస్పెక్ట్ షీట్ ఉన్న వాళ్లను అదుపులోకి తీసుకుని విచారించారు. వాహనాల పత్రాలను సమర్పిస్తే తిరిగి ఇస్తామని ఏఎస్పీ రమణమూర్తి తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరు దుర్మరణం



కాకుమాను: ద్విచక్ర వాహనాన్ని ఓ లారీఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన దుర్ఘటన పెదనందిపాడు మండలంలోని వరగానిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ తెలిపిన వివరాల మేరకు.. వరగాని గ్రామానికి చెందిన తూమాటి శాంసన్ (62), దేవరపల్లి జాన్‌బాబు(14)లు గ్రామంలోని శ్మశాన వాటికలో కూలీ పనులు ముగించుకుని మోపెడ్‌పై ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో గుంటూరు నుంచి చీరాల వైపు వెళ్తున్న ఏపీ16 ఎక్స్2187 నెంబరు కలిగిన లారీ వీరిని ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం తర్వాత డ్రైవరు లారీని ఆపకుండా పారిపోయాడు. చీరాలలో గుర్తించి లారీ డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యార్డుకు 43,722 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 43,722 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 43,251 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 39,427 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

అంకాలమ్మతల్లి వీరతిలకం దిద్దిందా.. నాగులేరు నవోత్సాహంతో పరవళ్లు తొక్కిందా.. చెన్నకేశవుని గుడిగంట గణగణ మోగుతూ సుస్వాగతమంటూ వీరాచారులకు ఆహ్వానం పలికిందా.. బ్రహ్మనాయుడు ఆయుధం ఉగ్రనృసింహ కుంతలం వీరవిహారానికి కాలుదువ్విందా.. అన్నట్టు పల్నాడు రణక్షేత్రం ఉత్సాహంతో ఉప్పొంగుతోంది. వీరారాధనోత్సవాలకు ముస్తాబై 'సంబర'నాదమై మార్మోగుతోంది.

పల్నాటి నుదుటన వీరతిలకం

- రేపటి నుంచి రణక్షేత్రంలో వీరారాధనోత్సవాలు
- ఐదు రోజులపాటు కొనసాగనున్న వేడుకలు
- తరలిరానున్న వీరాచారులు



కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కార్యమపూడి (కారెంపూడి)లో పల్నాటి వీరారాధన ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. కార్తిక అమావాస్య నుంచి ఐదు రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వీరాచారులు వేలాదిగా కారెంపూడి తరలివచ్చి తమ వీరాచారాన్ని నెరవేర్చనున్నారు. పల్నాటి యుద్ధం క్రీ.శ 1182లో జరిగింది. యుద్ధంలో వీరమరణం పొందిన పల్నాటి వీరులను వారి వారసులు ఏటా రణక్షేత్రంలో స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యుద్ధానంతరం బ్రహ్మనాయుడు నాగులేరు గంగధారి మడుగు ఒడ్డున మృతి చెందిన వీరులకు తర్పణాలు వదిలారు. అప్పటి నుంచి ఏటా వీరులను క్రమం తప్పకుండా స్మరించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. బహుశా ఇవి దేశంలోనే అత్యంత పురాతన ఉత్సవాలు కావచ్చని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాదీ పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో వీరాచారులు అత్యంత నిష్ఠతో ఉత్సవాల నిర్వహణకు తరలిరానున్నారు. దీని కోసం చెన్నకేశవుడు, అంకాలమ్మ, వీరుల గుడులను సుందరంగా ముస్తాబు చేశారు. చారిత్రక ప్రదేశాలైన కోట బురుజు, బ్రహ్మనాయుడు మేడను సందర్శకులు తిలకించేందుకు అనువుగా ఏర్పాట్లు జరిగాయి.



బ్రహ్మనాయుడు మేడ

చెన్నకేశవుడు, అంకాలమ్మల సాక్షిగా..

ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబరు నాలుగు వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. పల్నాటి యుద్ధం నాటి ముఖ్యమైన ఐదు చారిత్రక ఘట్టాల పేర్లతో వేడుకలు జరగనున్నాయి. 30న రాచగావు, 1న రాయబారం, 2న మందపోరు, 3న కోడిపోరు, చివరి రోజు 4న కళ్లిపాడు ఉత్సవాలు జరగనున్నాయి. వీరుల ఆయుధాలకు ప్రజలు నీరాజనాలు పలకనున్నారు. చెన్నకేశవస్వామిని, వీర్ల అంకాలమ్మ తల్లిని లక్షలాదిగా ప్రజలు దర్శించుకుని కొలుపులు నిర్వహించనున్నారు. పల్నాటి వీరులు తమ ఆరాధ్య దైవం చెన్నకేశవుడు, ఆరాధ్యదేవత వీర్ల అంకాలమ్మలను 11వ శతాబ్దంలో ప్రతిష్ఠించుకున్నట్లు ప్రతీతి. అందుకే చెన్నకేశవస్వామిని అంకాలమ్మను వీరాచారులు స్మరించుకుంటూ కత్తి సేవలు చేసుకుంటూ గ్రామోత్సవాలు నిర్వహిస్తూ సంప్రదాయ మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. వీరుల గుడిలో రోజూ రాత్రి పల్నాటి చారిత్రక కథలను వీరవిద్యావంతులు ఆలపిస్తారు.



కోట బురుజు

మహనీయుడు జ్యోతిరావు పూలే

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

బాపట్ల: మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134 వ వర్ధంతి కార్యక్రమం గురువారం బాపట్లలో జరిగింది. స్థానిక పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలకు విద్య అవసరమని గుర్తించిన మేధావిగా అభివర్ణించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రాజేష్ దాసు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్

బాలిక హత్య కేసులో నిందితుడి పట్టివేత?

- ఐదు నెలలుగా చిక్కని గ్యాస్ డెలివరీ బాయ్
- ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్న పోలీసులు



నాగరాజు (ఫైల్)

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన దళిత విద్యార్థిని హత్య కేసులో నిందితుడైన గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. జూలై 15వ తేదీన జరిగిన పేరుపోగు శైలజ హత్య ఘటన సంచలనం కలిగించింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శైలజను అదే ప్రాంతంలో ఉండే నాగరాజు హత్య చేసి పరారయ్యాడు.


ఐదు నెలలుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు అదుపులోకి తీసుకోగలిగారు. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వర రావు, చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణ, సిబ్బంది కలిసి రాజమండ్రి సమీపంలో అక్కడి పోలీసుల సహాయంతో రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో స్పిన్నింగ్, తాపీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడని తెలిసింది. నాగరాజుకు గతంలో కూడా నేర చరిత్ర ఉండటంతో సాంకేతిక పరిజ్ఞానానికి కూడా చిక్కకుండా జాగ్రత్తపడ్డాడు. కరోనా సమయంలో చేబ్రోలు ప్రాంతానికి వచ్చి బతుకుదెరువు కోసం హోటల్ కార్మికుడిగా చేరాడు. కొంత కాలానికి గ్యాస్ కంపెనీలో రోజువారీ కూలీగా పనిచేశాడు. కొత్తరెడ్డిపాలెం దళితవాడ ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉండేవాడు. కృష్ణా జిల్లా కొండపల్లికి చెందిన అతడిపై ఆ ప్రాంతంలో హత్య, హత్యాయత్నం కేసులు ఉన్నాయి. పథకం ప్రకారం బాలికను హత్య చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సంచరించాడు. నాగరాజు అరెస్టును రెండు రోజుల్లో చూపే అవకాశం ఉంది.

పెళ్లి కుదిరితే మొక్కాల్సిందే!



గుంటూరులోని హరిహర మహల్ థియేటర్ వద్ద సీతమ్మ పాదాలు ఉన్న రావిచెట్టు

- నేటికీ కొరిటెపాడులో పూజలు అందుకుంటున్న సీతమ్మ పాదాలు
- బ్రిటీషు కాలానికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నట్లు ప్రచారం
- గతంలో ఈ ప్రాంతం కొరిటెపాడు గ్రామ పొలిమేర



సీతమ్మ పాదాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరం నడిబొడ్డున సీతమ్మ వారి పాదాలు దశాబ్దాలుగా పూజలందుకుంటున్నాయి. కొరిటెపాడు మెయిన్‌రోడ్డులో హరిహర మహల్ థియేటర్ ఎదుట రోడ్డు పక్కన రావి చెట్టు వద్ద వెలిసిన సీతమ్మ పాదాలు బ్రిటీషు కాలానికి పూర్వం నుంచి ఉన్నాయి. ప్రస్తుతం గుంటూరు నగరంలోని ఒక ముఖ్యమైన ప్రాంతంగా ఉన్న కొరిటెపాడు అప్పట్లో ఒక గ్రామంగా ఉండేది. ప్రస్తుత హరిహర మహల్ ప్రాంతం కొన్ని దశాబ్దాలకు పూర్వం కొరిటెపాడు గ్రామ పొలిమేర. సీతమ్మ వారి పాదాలను గ్రామదేవతగా భక్తులు పూజిస్తున్నారు. చరిత్రకు అందని కాలంలోనే ఇక్కడ సీతమ్మ వారి పాదాలు వెలిసినట్లు స్థానికులు చెబుతున్నారు. రావిచెట్టు మొదట్లో ఉన్న సీతమ్మ పాదాలు కాలక్రమేణ నగరం విస్తరించడంతోపాటు రహదారి నిర్మాణ పనులతో రోడ్డును ఆనుకుని ఉన్నాయి. గతంలో ఎటువంటి రక్షణ లేని పరిస్థితుల్లో కొంత కాలం క్రితం చుట్టూ గోడను నిర్మించారు. కొరిటెపాడుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వివాహం నిశ్చయం అయిన ఆడ పిల్లలను వెంట పెట్టుకుని కుటుంబ సమేతంగా ఇక్కడకు వచ్చి, సీతమ్మ పాదాలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అలా చేస్తే శుభప్రదం అని నమ్ముతారు. ఇక్కడి రావిచెట్టు దశాబ్దాలుగా అలానే ఉంది. రహదారి విస్తరణ పనుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం సైతం రావిచెట్టును కదిలించే ప్రయత్నం చేయకుండా దాని పవిత్రతను కాపాడుతున్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న సీతమ్మపాదాల చెంత పలువురు సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి తదితర దేవతా విగ్రహాలను తెచ్చి పెడుతున్నారు. దశాబ్దాల ప్రాశస్త్యం గల సీతమ్మపాదాలను పరిరక్షించాల్సిన అవసరముంది.

మార్కెట్ కమిటీ ఉద్యోగులకు వేతనాల్లేవ్!

- అక్టోబర్ నెల వేతనాలు ఇంతవరకు అందని వైనం
- తొలిసారిగా మార్కెట్ కమిటీ ఉద్యోగులకు ఈ దుస్థితి
- ప్రభుత్వానికి ఆదాయం తెస్తున్నా ఇదేం బాధని ఆవేదన

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగులకు అక్టోబర్ నెల వేతనాలు ఇంతవరకు అందలేదు. గతంలో వేతనాల చెల్లింపు సకాలంలో జరిగేవి. ఎప్పుడూ లేని విధంగా అక్టోబర్ జీతాలు నవంబర్ నెల పూర్తి కావస్తున్నా అతీగతీ లేకపోవడంపై సర్వత్రా ఆవేదన వ్యక్తం అవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మార్కెట్ కమిటీ ఉద్యోగులదీ ఇదే పరిస్థితి. గుంటూరు జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఉద్యోగులు ప్రతి నెలా వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ఒక్క శాతం ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రతి కమిటీ రూ.లక్షల్లో ఇలా వసూలు చేస్తుంది. అదే రోజు సీఎఫ్ఎంఎస్ ద్వారా ప్రభుత్వానికి ఈ మొత్తం చేరుతుంది. ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇచ్చే వాటిలో మార్కెట్ కమిటీలు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత వీరు వేతనాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. మరో రెండు రోజులు గడిస్తే నవంబర్ నెల వేతనాలు కూడా ఇవ్వాలి. కానీ గత నెల జీతం రాకపోవడంతో ఉద్యోగులు కుటుంబ పోషణ, ఈఎంఐల చెల్లింపులు, పిల్లల ఫీజులు, వైద్య అవసరాల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. 2014 –19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. నాటి నుంచి మార్కెట్ కమిటీ ఉద్యోగులు సకాలంలో వేతనాలు పొందని పరిస్థితి ఏర్పడింది. మొదటిసారిగా నెల అవుతున్నా జీతాలు రాలేదు.

సమర్థంగా నీటి సంఘాల ఎన్నికలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: నీటి సంఘాల ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. నీటి సంఘాల ఎన్నికల ఎన్నికల నిర్వహణపై జల వనరులు, రెవెన్యూ శాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ ఓటు హక్కు ఉండాలని కలెక్టర్ చెప్పారు. డిసెంబర్ 8వ తేదీన నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల అధికారుల నియామకం, తదితర ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలన్నారు. సీసీఆర్‌సీ కార్డుదారులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలోని అధికారులకు డివిజన్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఐదో తేదీన ఎన్నికల ప్రకటన జారీ చేయాలన్నారు. జిల్లాలో 1,944 టెరిటోరియల్ కానిస్టెన్సీస్ ఉన్నాయన్నారు. ఇందులో ఒక్కొక్క సభ్యుడి ఎన్నిక జరగాలన్నారు. 170 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు జరపాలన్నారు. డిసెంబర్ 11వ తేదీన 22 డీసీ (కాల్వ కమిటీలు) ఎన్నిక జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 14వ తేదీన కేడబ్ల్యూబీ (పశ్చిమ కృష్ణా డెల్టా) ప్రాజెక్ట్ కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. సమస్యలు ఉత్పన్నంకాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, జలవనరుల శాఖ ఎస్ఈ అబూతలీమ్, ఈఈ వెంకటరత్నం, ఇంజినీరింగ్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, పక్కన ఏఎస్పీ విఠలేశ్వర్

30న పింఛన్ల పంపిణీ..

బాపట్ల: ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు డిసెంబర్ నెల నగదును ఈనెల 30వ తేదీన పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదు పంపిణీపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, తహసీల్దార్లతోను మాట్లాడారు. డిసెంబర్ ఒకటో తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే నగదు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో ముందుగానే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలని ఆదేశించారు. 30వ తేదీన పింఛన్ ఇస్తామనే విషయాన్ని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయాల సిబ్బంది చెప్పాలన్నారు. శనివారం ఉదయం ఐదున్నర గంటలకే పింఛన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఉంటుందన్నారు. 30వ తేదీనే నూరుశాతం పంపిణీ చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ పద్మజ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఔను.. నేను జడ్జినయ్యాను

- తొలి ప్రయత్నంలోనే ఏపీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన యువతి
- కఠోర శ్రమతో లక్ష్యంపై గురి
- ఫలించి విజయతీరాలకు..



షేక్ రోషన్

'న్యాయవాదిగా పని చేస్తున్నా. చూస్తూ ఉండండి. ఎప్పటికైనా నేను న్యాయమూర్తిని అవుతా' అంటూ తల్లిదండ్రులతో ఆమె తరచూ వ్యాఖ్యానించేవారు. చెప్పడమే కాదు పట్టుదలతో తాను అనుకున్నది సాధించి చూపారు. ఆమే సత్తెనపల్లికి చెందిన షేక్ రోషన్. ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ పరీక్షల్లో ఓపెన్ క్యాటగిరిలో నాలుగో స్థానంలో నిలిచారు.

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన యువతి షేక్ రోషన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. సిటీ కేబుల్ ఆపరేటర్ షేక్ కార్జ్‌ముల్ల కరిముల్లా, సత్తెనపల్లి ప్రధాన జూనియర్ జడ్జి(సివిల్ డివిజన్) కోర్టులో జూనియర్ అసిస్టెంట్ సుజాత దంపతుల కుమార్తె షేక్ రోషన్. ఆమె చిన్నప్పటి నుంచి చదువుల్లో దిట్ట. ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకు నెల్లూరు వేదవ్యాస్‌లో, ఆరు నుంచి పదో తరగతి వరకు సత్తెనపల్లిలోని ప్రగతి విద్యాసంస్థలో, ఇంటర్మీడియెట్ గుంటూరు మాట్రిక్స్‌లో చదివారు.. 10వ తరగతిలో 9.8 గ్రేడ్ సాధించిన ఆమె ఇంటర్మీడియెట్‌లో 970 మార్కులు సాధించారు. ఎల్ఎల్‌బీ విశాఖలోని దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీలో చదివి ఏ–గ్రేడ్‌లో 87.7 శాతం మార్కులతో 2023లో పూర్తి చేశారు. అనంతరం ఏపీ బార్ కౌన్సిల్‌లో జూనియర్ న్యాయవాదిగా చేరి ఏడు నెలల పాటు ప్రాక్టీస్ చేశారు. ఈ క్రమంలోనే 'చూస్తూ ఉండండి. ఎప్పటికైనా నేను న్యాయమూర్తిగా ఎంపిక అవుతాను' అంటూ తల్లిదండ్రులతో ఆమె వ్యాఖ్యానించేవారు. ఏం చేసినా అంకితభావంతో చేయాలన్న కన్నవారి మాటలను రోషన్ ఆచరించారు. ఈ ఏడాది జనవరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జ్యుడీషియల్ సర్వీసులో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు నోటిఫికేషన్ విడుదలైంది. జూలైలో జరిగిన ప్రిలిమినరీలో ఆమె ఉత్తీర్ణత సాధించారు. ఆపై ప్రధాన పరీక్షతోపాటు, ఈనెల 7న జరిగిన ఇంటర్వ్యూలో ప్రతిభ చూపారు. గురువారం విడుదలైన ఫలితాల్లో ఓపెన్ క్యాటగిరిలో నాలుగో ర్యాంకు దక్కించుకొని జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు.



కుమార్తెకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు సుజాత, కరీముల్లా

నిత్యం లక్ష్యం పైనే గురి..

మన గురి లక్ష్యంపై నిలపడమే ప్రధాన విజయసూత్రమని అంటున్నారు రోషన్. న్యాయవ్యవస్థ ప్రధానంగా పురుషులకు చెందినదనే భావన కొందరిలో ఉందన్నారు. అది తప్పని నిరూపించేందుకే తాను సవాల్‌గా స్వీకరించి పరీక్షలకు సిద్ధమైనట్టు చెప్పారు. తనకు చిన్నప్పటి నుంచి టీవీ చూడటం, సెల్‌ఫోన్ వాడటం ఇష్టం ఉండేది కాదని, ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్ ఉపయోగించలేదని తెలిపారు. లక్ష్యంపై గురిపెట్టడానికి ఇవన్నీ ఆటంకాలుగా ఉంటాయి అనేది తన భావన అన్నారు. తాను ఫైనలియర్ చదువుతుండగానే పూణేలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో లీగల్ అడ్వైజర్‌గా అవకాశం వచ్చినా వెళ్లకుండా పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ విజయంలో తన తల్లిదండ్రుల పాత్ర ఎంతగానో ఉందని, వారు సూచనలు, సలహాల పరంగా, ఆర్థికంగా అండగా నిలిచారని చెప్పారు. రోషన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో ఆమె తల్లిదండ్రులు, బంధువుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

క్లుప్తంగా

రేపు ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ డే వేడుకలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ వేడుకలు ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గురువారం తెలిపారు. వేడుకల్లో 25 మందికి మెమోరియల్ అవార్డులను అందించనున్నట్లు వెల్లడించారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియాలు సంయుక్తంగా ఈ వేడుకలను జర్నలిజం విభాగంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫొటోగ్రఫీ రంగంలో కొనసాగిన వారికి ఫొటో కాంటెస్ట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫొటోగ్రఫీలో నిష్ణాతులై ఉండి మృతిచెందిన వారి పేరు మీద 25 మెమోరియల్ అవార్డులకు ఫొటోలు ఎంపిక చేసినట్లు తెలిపారు. అవార్డులు పొందిన ఛాయ చిత్రాల ప్రదర్శనను ఈ వేడుకల్లో నిర్వహిస్తామని ప్రకటించారు. విజేతలకు బంగారు పతకంతో పాటు నగదు బహుమతులను కూడా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అందజేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా అవార్డులు పొందిన వారి వివరాలు ఆయన విడుదల చేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సురేష్ కుమార్, జర్నలిజం విభాగం ఇన్‌చార్జి డాక్టర్ జె.మధుబాబు, ఫొటోగ్రఫీ కోర్స్ అతిథి అధ్యాపకులు టి.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రగతి సమావేశం విజయవంతం చేద్దాం

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు


విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ విజయ రామరాజు, కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: విద్యార్థుల ప్రగతిపై నిర్వహించనున్న తల్లిదండ్రుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. సీఎం పర్యటన ఖరారు కావడంతో విద్యాశాఖ కమిషనర్ బుధవారం బాపట్లకు చేరుకుని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళితో చర్చించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యే మున్సిపల్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలోని ప్రతి తరగతి గదిని కలెక్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. విద్యార్థుల ప్రగతి, విద్యా బోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ...

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థుల ప్రగతిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. 912 మంది విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిసెంబర్ 7వ తేదీన హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తినింపడానికి ఉన్నతస్థాయికి ఎదిగిన ఈ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పోలీస్ కవాతు మైదానంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్, పాఠశాలకు చేరుకునే మార్గంపై చర్చించారు. తదుపరి పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట సమగ్రశిక్ష అభియాన్ అధికారి డి.శ్రీనివాసరావు, విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

జాతీయ సమైక్యతకు ఎన్‌సీసీ దోహదం

- 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్
- ప్రతిభ చూపిన క్యాడెట్లకు అభినందన


పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న కల్నల్ సునీల్ గౌతమ్

చీరాల టౌన్: జాతీయ సమైక్యతకు ఎన్‌సీసీ దోహదపడుతుందని 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, కల్నల్ సునీల్ గౌతమ్ పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 24 వరకు రాజస్తాన్ రాష్ట్రం జైసల్మేర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు అంతర్జాతీయ క్యామెల్ సఫారీ నిర్వహించారు. ఈ క్యాంపులో 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఎం. హేమంత్, ఎన్. సాహిత్యరెడ్డి, మణి కుమార్‌లు ఉత్తమ ప్రతిభచూపి పతకాలు సాధించారు. గురువారం క్యా డెట్లు ఎన్‌సీసీ కార్యాలయంలో కల్నల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్నల్ మాట్లాడుతూ.. బెటాలియన్ క్యాడెట్లు వివిధ రకాల క్యాంపుల్లో పాల్గొని పతకాలు సాధించడం గర్వకారణం అన్నారు. విజ్ఞానాన్ని, శారీరక దృఢత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంచి ఉత్తమ పౌరుడుగా తీర్చిదిద్దేది ఎన్‌సీసీనే అని చెప్పారు. జైసల్మీర్ క్యాంపులో విశేష ప్రతిభచూపి ఖ్యాతిని చాటిచెప్పిన క్యాడెట్లు చేసిన విన్యాసాలు, తీరు అద్భుతమని కొనియాడారు. ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు, స్నేహ బాంధవ్యాలు పెరిగి, జాతీయ సమైక్యతకు ముందడుగు వేస్తుందన్నారు. ప్రతిభ చూపి పతకాలు సాధించిన క్యాడెట్లును అభినందించి సత్కరించారు. మేజర్ సుధీర్‌కుమార్, హవల్దార్ మేజర్ పి.రమేష్, సూపరింటెండెంట్ సలీం, సుబేదార్ ముఖేష్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

స్టువార్టుపురంలో ఎక్సైజ్ దాడులు

- 10 లీటర్ల నాటుసారా సీజ్.. 700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- వెల్లడించిన ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జనార్ధనరావు


నాటుసారా, బెల్లంఊటను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

బాపట్లటౌన్: నాటుసారా తయారుచేసినా...విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జనార్ధనరావు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని స్టువార్టుపురంలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతోపాటు మరో ఇద్దరు నిందితులను అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. నాటు సారా తాయారు చేసే, అమ్మే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. సారా తయారీ, అమ్మకాలపై ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. బాపట్ల మండలంలో నల్లబెల్లంను నాటు సారాయి తయారీదారులకి అమ్మేవారిపై కూడా ప్రత్యేక దష్టి సారించామన్నారు. గతంలో నాటు సారా అమ్మినవారిపైన, వారికి సహకరించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసామన్నారు. పదే పదే నేరం చేసే వారిపై పీడీ యాక్ట్‌లు నమోదుచేస్తామని హెచ్చరించారు. దాడులు నిర్వహించిన వారిలో ఈఎస్‌టీఎఫ్ బాపట్ల ఏఈఎస్ బి.వెంకటేశ్వర్లు, చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, బాపట్ల సీఐ పి.గీతిక, ఎస్ఐలు ప్రభుదాస్, ఎస్. మౌనిక పాల్గొన్నారు.

450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చీరాల: నాటు సారా తయారీ కోసం సిద్ధం చేసిన బెల్లం ఊటను గురువారం ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్‌టీఎఫ్, ఈఎస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు చీరాల, బాపట్ల ఎక్సైజ్ సిబ్బంది చీరాల రామ్‌నగర్ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి డ్రమ్ముల్లో సిద్ధం చేసిన 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేయడం నేరమని, సారా నిర్మూలనకు నిత్యం దాడులు చేస్తామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

నేత్రపర్వంగా సామూహిక సత్యనారాయణ వ్రతం


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

బాపట్ల: పట్టణంలోని కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో భారీ సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు గురువారం జరిగాయి. 1500 మంది సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. పండిత శ్రీమాన్ ముత్తేవి శ్రీనివాస శశికాంత్ యాజ్ఞికంలో భావపురి భక్త బృందం, శ్రీలలితా త్రిపుర సుందరీ పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, బాపట్ల, పొన్నూరు మున్సిపల్ కమిషనర్లు రఘునాథ రెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు. విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో 5000 మందికి అన్న సంతర్పణ నిర్వహించారు. అర్చకులు మేడూరి అప్పలచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, శ్రీనివాసుల విఖనస మూర్తి, కొల్లిపర ప్రసాద్ స్వామి, పంగులూరి కౌండిన్య, గూడూరు సాయి వెంకట్, భక్త బృందం సభ్యులు ఉప్పాల హరికృష్ణ, బండి రాంబాబు, యస్వంత్, చంద్రమోహన్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-నామ్ ద్వారానే మిర్చి క్రయ విక్రయాలు

మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆదేశం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి క్రయవిక్రయాలన్నీ ఈ-నామ్ విధానంలోనే జరగాలని మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత ఆదేశించారు. చుట్టుగుంటలోని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో అధికారులతో గురువారం సాయంత్రం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యార్డులో ఈ-నామ్ విధానం అమలు చేయని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యార్డుకు మిర్చి బస్తాలు వచ్చిన వెంటనే లాట్ ఐడీలు గేటు వద్ద జనరేట్ చేయాలని సూచించారు. సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మాత్రమే దిగుమతులకు అనుమతించాలన్నారు. ఎగుమతి వ్యాపారులు కొనుగోలు చేసిన సరకుకు మధ్యాహ్నం 3 గంటలలోపు బిడ్డింగ్ పూర్తయ్యేలా చూడాలన్నారు. కాపలాదారులు విధిగా ఐడీ కార్డులు, యూనిఫాం ధరించి విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చి బస్తాలు ఆ రోజే బయటకు తరలిపోయేలా చూడాలని ఆదేశించారు. మచ్చు కాయలు తీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యార్డులో జీరో వ్యాపారానికి స్వస్తి పలకాలని, ఎలాంటి బిల్ టు బిల్ వ్యాపారాలను అనుమతించరాదని ఆమె ఆదేశించారు. మార్కెటింగ్ విజిలెన్స్ జేడీఏ రాజశేఖర్, జేడీఏ కాకుమాను శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మాజీ మహిళా డీలర్‌కు బెదిరింపులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీకి చెందిన చౌక దుకాణ మాజీ డీలర్ అయిన తనను కొందరు అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని మోడీ కోమలి గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. మహిళననే గౌరవం కూడా లేకుండా పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసులు పెడతామని, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిప్పుతామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. చౌక దుకాణ శాశ్వత లైసెన్స్‌కి రాజీనామా చేయకపోతే ఇబ్బంది పడతావని హెచ్చరిస్తున్నారని, ఇప్పటికే డ్వాక్రా చౌక దుకాణానికి రాజీనామా చేశానని పేర్కొన్నారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

అమరావతి: స్థానిక హిందూ శ్మశానవాటిక దాటిన తరువాత కృష్ణానదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించారు. మహిళకు సుమారు 45 ఏళ్ల వయసు ఉంటుందని భావిస్తున్నారు. అమరావతి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మహిళ ఎర్రరంగు జాకెట్, బ్రౌన్‌కలర్ లోలంగా ధరించి ఉంది. ఆచూకీ గుర్తించిన వారు 9440796217,944079266 నంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

రేపటి నుంచి సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు

రేపల్లె రూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఎం) బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు ఈ నెల 30వతేదీ నుంచి డిసెంబరు 1తేదీ వరకు బాపట్లలోని రథం సెంటరులో నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ చెప్పారు. సీపీఎం జిల్లా మహాసభ పోస్టర్‌లను పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విడుదల చేసి అనంతరం మాట్లాడారు. బాపట్ల జిల్లా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అనేక ప్రజా సమస్యలపై సీపీఎం ఉద్యమాలు నిర్వహించిందని గుర్తుచేశారు. భవిష్యత్తు పోరాటాలను రూపొందించుకోవడానికి, దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలపై పెడుతున్న భారాలను ఎదుర్కోవటానికి ఈ మహాసభలో చర్చించడం, నూతన కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సభలలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డి.రమాదేవి, సిహెచ్ బాబురావు, సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అనుమానాస్పద రీతిలో వృద్ధుడు మృతి

- తండ్రీకొడుకుల మధ్య డబ్బుల కోసం గొడవ
- కొడుకే చంపి ఉంటాడని స్థానికుల అనుమానం

అద్దంకి రూరల్: అనుమానాస్పద రీతిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం అద్దంకిలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని భాగ్యనగర్ నాలుగో లైన్‌లో నివాసం ఉంటున్న ముప్పరాజు వెంకటేశ్వర్లు (64) గతంలో లారీలో క్లీనర్‌గా పనిచేసేవాడు. ఆరోగ్యం సరిగా లేకపోవటంతో కొంతకాలం నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. వెంకటేశ్వర్లు భార్య 15 ఏళ్ల క్రితం మరణించింది. వీరికి ఒక కుమారుడు సుబ్బారావు ఏ పని చేయకుండా ఉంటూ చెడువ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో మృతుడు వెంకటేశ్వర్లు స్వగ్రామం మండలంలోని కళ్యాపురంలో ఉన్న పొలాన్ని 6 నెలల క్రితం అమ్మితే సుమారు సుమారు రూ.12 లక్షల వరకు వచ్చాయి. ఆ డబ్బులతోనే ఇరువురూ మద్యం తాగుతూ ఉండేవారు. ఈ నగదు విషయమై సుబ్బారావు తరచూ తండ్రితో గొడవ పడుతుండేవాడు. గతంలో ఒకటి రెండు సార్లు సుబ్బారావు తండ్రిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. తెల్లవారే సరికి వెంకటేశ్వర్లు మంచం మీదే తలకు బలమైన గాయంతో విగతజీవిగా పడి ఉన్నాడు. పరిసర గృహాలవారు పోలీసులకు సమాచారం అందించటంలో సీఐ, సిబ్బందితో అక్కడకు చేరుకుని వృద్ధుడి మృతికి గల కారణాలు, పరిసరాలను పరిశీలించారు. కుమారుడు సుబ్బారావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చీరాల డీఎస్పీ మోయిన్, సీఐతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉత్తరాఖండ్‌పై ఆంధ్ర జట్టు ఆధిక్యం


7 వికెట్లు తీసిన రితిక్ ధూమ్ (ఉత్తరాఖండ్)


7 వికెట్లు తీసిన ఏఎస్‌వీ లోహిత్ (ఆంధ్ర)

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో గల ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కూచ్ బెహారా అండర్ -19 క్రికెట్ ట్రోఫీలో ఆంధ్ర జట్టు ఉత్తరాఖండ్ జట్టుపై ఆధిక్యం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర జట్టు 48.4 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. ఉత్తరాఖండ్ జట్టు బౌలర్ రితిక్ ధూమ్ ఏడు వికెట్లు తీసి ఆంధ్రా జట్టును కుప్పకూల్చాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 18.4 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర జట్టు బౌలర్ ఏవీఎస్ లోహిత్ ఏడు వికెట్లతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర జట్టు 19 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 76 పరుగులు సాధించింది. తొలి రోజు ఆంధ్ర జట్టు తన ఆధిక్యాన్ని చాటుకుంది.

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఏపీఆర్జేసీ పూర్వ విద్యార్థి

విజయపురిసౌత్: నాగార్జునసాగర్, విజయపురిసౌత్‌లో ఏపీఆర్‌జేసీ జూనియర్ కళాశాలలో 1980–82 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి డాక్టర్ ఏవీఎస్ రమేష్ చంద్రకు ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో కేంద్ర ప్ర భుత్వ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి లభించింది. విదేశీ వ్యవహారాల బాధ్యతలను రమేష్ చంద్ర పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే ఆయ న భారత రాయబారిగా తుర్కియే, ఉగాండా వంటి 10 దేశాల్లో సేవలందించారు. ఏపీ, తెలంగాణకు నోడల్ అధికారిగా విదేశీ వ్యవహారాలనూ ఏవీఎస్ చూశారు. ఉద్యోగోన్నతి పొందడంపై ఏపీఆర్జేసీ ప్రిన్సిపాల్ సరోజినితోపాటు కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

గుంటూరు వైద్య కళాశాలకు బస్సుల వితరణ

ఐదు రోజుల వ్యవధిలో రెండు వాహనాలు అందించిన '99 బ్యాచ్'


డాక్టర్ సుందరాచారికి చెక్కు అందజేస్తున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ వైద్య విద్యార్థులు తమ కాలేజీ రుణం తీర్చుకునేందుకు ముందుకు వచ్చారు. తొలి బస్సు కొనుగోలుకు రూ. 40 లక్షలను చెక్కు రూపంలో అందజేశారు. గురువారం మరో బస్సు కోసం రూ. 35.40 లక్షలకు చెక్కును ప్రిన్సిపల్‌కు ఇచ్చారు. బాహుబలి సర్జన్ అయిన ప్రముఖ న్యూరో సర్జన్, గుంటూరు బ్రింద హాస్పటల్ అధినేత డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తొలి బస్సుకు విరాళాలు వచ్చాయి. క్లాస్ రిప్రజెంటేటివ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.సునీల్‌కుమార్ నాయక్ చొరవతో రెండో బస్సుకు నగదు సమకూరింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ బస్సు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందిని చెప్పగానే పూర్వ విద్యార్థులు రోజుల వ్యవధిలో రెండు బస్సులకు నగదు అందించడం అభినందనీయం అన్నారు. డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి రూ. 99 లక్షలు విరాళం ఇవ్వాలని తమ బ్యాచ్ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ అమెరికాలో ఉంటున్న మిత్రులు కూడా వెంటనే స్పందించారని, విరాళాలు ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, లా కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లకు ఈనెల 29న ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ గురువారం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 29న ఆయా కోర్సుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పీజీ కోర్సుల్లో ఖాళీ సీట్ల వివరాలను వెల్లడించారు. ఎంఏ ఇంగ్లిష్ 8, లింగ్విస్టిక్స్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 10, తెలుగు 15, సంస్కృతం 10, హిందీ 10, ఉర్దూ 10, బుద్ధిష్ట్ స్టడీస్ 10, జర్నలిజం 15, సోషియాలజీ 20, సోషల్ వర్క్ 20, రూరల్ డెవలప్‌మెంట్ 15, హిస్టరీ 10, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ 7, పొలిటికల్ సైన్స్ 7, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 10, ఎకనామిక్స్ 15, ఎంకామ్ 17, ఎంఈడీ20, ఎంఎల్ఐఎస్సీ 10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ సీట్లు పొందేందుకు ఏపీపీజీ సెట్ రాయని వారు కూడా అర్హులేనని తెలిపారు. వివరాలకు ఏఎన్‌యూ పీజీ అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని చెప్పారు.